డిండి రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేతలు

కాంగ్రెస్ మాయ మాటలకు మోసపోవద్దు

హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్లను లోక్‌సభకు పంపించాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చందంపేట/ డిండి, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ పార్టీ మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తుందని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన, రైతుల కోసం పోరాడేది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. ఓట్ల కోసం మాయ మాటలు చెబుతున్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి పంద రోజులు దాటినా ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కరెంటు కోతలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోకుండా ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. రైతు రుణమాఫీని ఇంకెన్నాళ్లు దాటేస్తూ వస్తారని, ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తారని ప్రశ్నించారు. ఎకరానికి రూ.15వేల రైతు బంధు, వడ్లకు రూ.500 బోనస్ ఏమయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చెందిన రాష్ట్రం.. ఇప్పుడు కరువుతో విలవిల్లాడుతుందన్నారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏం జరిగింది.. నాలుగు నెలల కాంగ్రెస్ పాలన ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు సాగునీరు, పెట్టుబడి కోసం ఎకరానికి రూ.10వేలు, రైతు బీమా, 24గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచి నీరు ఇచ్చామని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేశామని తెలిపారు. నిరుద్యోగ యువతకు రూ.4వేల భృతి, కాలేజీ యువతులకు స్కూటీలు, వృద్ధులకు రూ.4వేల పెన్షన్ ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. వాటిని అమలు చేసే తెలివి లేక కేసీఆర్‌పై తిట్ల పురాణం మొదలు పెట్టిండని విమర్శించారు. తిట్లు, ఒట్ల పురాణంతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పాలిచ్చే బర్రెను కాదు.. పొడిచే దున్నపోతును తెచ్చుకున్నామని రాష్ట్ర ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపిస్తే దున్నపోతు మెడలు వంచి పని చేయించేందుకు కేసీఆర్‌కు ముల్లు కర్ర ఇచ్చినట్లువుతుందన్నారు. కాంగ్రెస్ మోసాలను ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే దేవరకొండ నియోజకవర్గానికి రైల్వే లైను, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. స్వామి నాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం వరికి గిట్టుబాటు ధర రూ.3500, పత్తికి రూ.13వేలు అమలు జరిగేందుకు పార్లమెంటులో పోరాడుతానన్నారు. అనంతరం వెంకట్ ద్రావిడ్ ఆధ్వర్యంలో బీఎస్పీ నుంచి పలువురు జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమాల్లో పార్టీ పార్లమెంటు ఎన్నికల దేవరకొండ నియోజకవర్గ సమన్వయకర్త రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, డిండి ఎంపీపీ సునీతాజనార్దన్‌రావు, పార్టీ నాయకులు సుధీర్‌రెడ్డి, టీవీఎన్ రెడ్డి, వడ్త్య రమేశ్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, ముత్యంరావు వల్లపురెడ్డి, గోవిందుయాదవ్, శంకర్‌నాయక్, లోక్యానాయక్, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములుగౌడ్, గోవర్ధన్, నెహ్రూనాయక్, వెంకటయ్య, లక్ష్మయ్య, శివ, శ్రీశైలం, మురళి పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

చందంపేట రోడ్ షోలో పాల్గొన్న జనం

నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయవాదులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గెలిపిస్తే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి
- జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్‌లో ఎన్నికల ప్రచారం

రామగిరి, ఏప్రిల్ 29 : నల్ల కోటు వెనుక ఉన్న కష్టాలు తనకు తెలుసని, తనను గెలిపిస్తే న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. నల్లగొండ బార్ అసోసియేషన్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం న్యాయవాదులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే తొలి ఎంపీ ల్యాండ్స్ నిధులు న్యాయవాదుల అభివృద్ధికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను చైతన్యం చేయడంలో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమైందని, అటువంటి వారు తనకు మద్దతుగా నిలువడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి లింగయ్యగౌడ్, సీనియర్ న్యాయవాదులు మునగాల నారాయణ, నేతి రఘుపతి, లొడంగి గోవర్ధన్, కె.జవహర్‌లాల్, జి.జవహర్‌లాల్, జి.వెంకటేశ్వర్లు, మామిడి బాలయ్య, మామిడి ప్రమీల, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

రేవంత్ సర్కారుకు ప్రజల నుంచి వ్యతిరేకత

- బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు పక్కా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు,
- మాజీ ఎంపీ బడుగుల

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 29 : అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలే ఎండగట్టాలని బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 9, 43వ వార్డుల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 43వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన అనతి కాలంలోనే కాంగ్రెస్‌పై అడుగడుగునా వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ మాయ మాటలకు మోసపోయి బీఆర్ఎస్ పార్టీకి అధికారం కట్టబెట్టలేక పోయామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ అత్యధిక ఎంపీ అభ్యర్థులను గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణను యావత్ దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. కాంగ్రెస్ పాలకులు మళ్లీ ఆకలి కేకల తెలంగాణగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్‌కు ఉద్యమాలు కొత్తకాదని, బంగారు తెలంగాణ సాధనకు ఆయన చేస్తున్న పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించారని గుర్తు చేశారు. హామీలు అమలు చేయలేని, అభివృద్ధి చేయడం చేతకాని కాంగ్రెస్ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు.

అడ్డగోలు హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా నిలదీయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు గౌడ్, నాయకులు ఆకుల లవకుశ, తాహెర్ పాషా, సుంకరి రమేశ్, సాగర్‌రెడ్డి, రాజా, రమేశ్, సలీమ్, ఉపేందర్‌రావు, మీనయ్య, లక్ష్మి, సల్మా మస్తాన్, కరుణశ్రీ, మహేశ్వరి పాల్గొన్నారు.

నల్లగొండలో 22.. భువనగిరిలో 39 మంది..

- పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారు
- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి : కలెక్టర్ హరిచందన
- రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లకూడదు : ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ, ఏప్రిల్ 29 : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఎవరుంటారనేది లెక్క తేలింది. పార్లమెంట్ పరిధిలో 22 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగిసింది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలో మొత్తం 56 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 25 మంది నామినేషన్లు ఎన్నికల అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. 9 మంది తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోగా అంతిమంగా 22 మంది బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నుంచి కుందూరు రఘువీర్ రెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి, బీఎస్పీ విరిగినేని అంజయ్య ప్రధానంగా పోటీలో నిలిచారు. పార్టీల అభ్యర్థులు మినహా స్వతంత్ర అభ్యర్థులకు ఈసీ ఆదేశానుసారం జిల్లా ఎన్నికల యంత్రాంగం గుర్తులు కేటాయించింది.

మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, పక్కన ఎస్పీ చందనా దీప్తి, ఎన్నికల పరిశీలకులు మాణిక్‌రావు సూర్యవంశీ

రెండు బ్యాలెట్ల ఈవీఎంలు

అభ్యర్థులు లెక్క కొలిక్కిరావడంతో బ్యాలెట్లు ఎన్ని అవసర పడతాయనేది తేలింది. ఒక ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ అనే మూడు ప్రధాన విభాగాలుంటాయి. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మందికి మించి అభ్యర్థులు పోటీ చేస్తే అదనపు బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉంటుంది. నోటాతో కలిపి అభ్యర్థుల సంఖ్య 17 నుంచి 32లోపు ఉంటే రెండు బ్యాలెట్ యూనిట్లు, 33 నుంచి 48లోపు ఉంటే మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉంటుంది. ఒక బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. ఈ లెక్కన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కో ఈవీఎంకు రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం పడనున్నాయి. ఇవే కాకుండా వివిధ కారణాలతో ఇబ్బందులు తలెత్తితే సమస్య లేకుండా మరికొన్ని ఈవీఎంలను ముందస్తుగా తరలించనున్నారు. బ్యాలెట్లపై తొలుత జాతీయ పార్టీల అభ్యర్థుల పేర్లు, ఆ తర్వాత గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, గుర్తులను ముద్రించనున్నారు.

నల్లగొండ పార్లమెంట్ పరిధిలో 17.25 లక్షల ఓటర్లు

నల్లగొండ లోక్ సభ నియోజకవర్గం పరిధిలో 17,25,465 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 8,80,453 మంది మహిళలు, 8,44,843 మంది పురుషులు, ఇతరులు 169 మంది ఉన్నారు. మొదటి సారిగా ఓటు వచ్చిన 18 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారు 61,143 మంది, సర్వీస్ ఓటర్లు 7,739 మంది, 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 9592 మంది, దివ్యాంగ ఓటర్లు 33,890 మంది నమోదయ్యారు.

మీడియాలో ప్రచారానికి అనుమతి తప్పనిసరి : కలెక్టర్

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులందరూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రవర్తన నియమాలను తప్పకుండా పాటించాలని నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్లో ఎస్పీ చందనా దీప్తి, ఎన్నికల సాధారణ పరిశీలకులు మాణిరావు సూర్యవంశీతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ లోక్ సభ స్థానానికి మొత్తం 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఎన్నిక నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించినట్లు చెప్పారు. ఎన్నికలు మే 13న నిర్వహించి, జూన్ 4న ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు కలెక్టర్ కార్యాలయంలో 5 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం కోసం అభ్యర్థులు ఎంసీఎంసీ ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఈ నెల 25 నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడం మొదలుపెట్టామని, వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడిగా సీనియర్ ఐఏఎస్ అధికారి మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీని నియమించారని ఏవైనా ఫిర్యాదులు, సందేహాలు ఉంటే ఆయన ఫోన్ నంబర్ 7337046757కు చేసి తెలియజేయవచ్చని చెప్పారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగ ఓటర్లకు మే 3వ తేదీ నుంచి హోమ్ వోటింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని, వీరు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని కోరారు.

భువనగిరి బరిలో 39 మంది..

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్ పరిధిలో 39 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 61 నామినేషన్లు దాఖలు కాగా 10 నామినేషన్లు ఎన్నికల అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. 12 మంది తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకున్నారు. బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేశ్, కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ నుంచి బూర నర్సయ్య గౌడ్ ప్రధానంగా పోటీలో నిలిచారు.

పెద్ద మొత్తంలో నగదు రవాణాపై నిఘా : ఎస్పీ

ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లేవారు సరైన ఆధారాలు చూపిస్తే ఇబ్బందులు ఉండవని ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. నగదు, బంగారు, మద్యం తదితర వాటిపై నిఘా ఉంటుందని, ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికలకు రెండు వారాలు మాత్రమే ఉండడంతో పకడ్బందీగా విధులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, లోక్ సభ ఎన్నికల డిప్యూటీ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు సహకరించాలి : మనోజ్‌కుమార్

పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులంతా సహకరించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ కోరారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులతో కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో వారు సమావేశమయ్యారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

- హామీలు అమలు చేయలేక దేవుళ్లపై ప్రమాణాలు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఏప్రిల్ 29 : మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ దేవుళ్లపై ప్రమాణాలు చేసే స్థాయికి దిగజారాడాని, ఇలాంటి ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేడని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాలలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంలో నెలకు రూ.2,500 ఇస్తానని, ఆడపిల్లల పెండ్లిళ్లకు తులం బంగారం అని చెప్పి మహిళలను మోసగించాడన్నారు. రైతు రుణ మాఫీ అని రైతులను మోసగించి ఇప్పుడు ఆగస్టు 15న మాఫీ చేస్తానని కొత్త డ్రామాకు తెరలేపి దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని, ఆర్‌టీసీని దివాళ తీయించి, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కారణమవుతున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

చేనేత సంఘాల బకాయిలు చెల్లించాలి..

2023 నవంబర్ వరకు చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, సంఘాల వద్ద నిల్వ ఉన్న స్టాకులను కొనుగోలు చేయాలని, టెస్కో ఖరీదుకు సంబంధించిన బిల్లుల జీఎస్‌టీ చెల్లించాలని, చేనేత మిత్ర సబ్సిడీ నెలకు రూ. 3000 బకాయిలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. చేనేత త్రిఫ్టు ఫండ్ పథకం కింద 2023 అక్టోబర్ నుంచి ఉన్న బకాయిలను చెల్లించాలని, 65 సంవత్సరాలలోపు వయస్సు ఉండి మరణించిన కార్మికుల బీమా డబ్బులను వారి ఖాతాలో జమచేయాలని, పావలాకు వడ్డీ డబ్బులను అన్ని సంఘాలకు చెల్లించాలని, చేనేత సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను రద్దు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు జగిని భిక్షంరెడ్డి, నాయకులు గుండెబోయిన సైదులు, వరకాంతం నరేందర్ రెడ్డి, కోనేటి ఎల్ల య్య, ఆవుల ఆనంద్, రాములు పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి : ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఏప్రిల్ 29 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి పార్టీ సత్తా చాటాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గళం వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకొని తీరాలని పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వం బీఆర్ఎస్ పార్టీ అని, రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. అందుకే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా ప్రజల్లో చైతన్యం కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, నాయకులు దూపటి రవీందర్, తెడ్డు భాస్కర్, సురేందర్, యాకూబ్‌నాయక్ పాల్గొన్నారు.

హామీలు మరిచిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

చౌటుప్పల్, ఏప్రిల్ 29 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. చౌటుప్పల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మోసాన్ని కూడా గుర్తు చేయాలని తెలిపారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.